

ప్రజాశక్తి
శనివారం 15 జులై 2023
5
విజయనగరం



అజయ్‌కు బంగారు పతకం



బంగారు పతకంతో అజయ్‌బాబు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కామన్వెల్త్ జూనియర్ వెయిట్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో కొండవెలగాడ క్రీడాకారుడు వల్లూరు అజయ్‌బాబు బంగారు పతకం సాధించాడు. శుక్రవారం ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో జరుగుతున్న పోటీల్లో అజయ్ 81 కిలోల విభాగంలో స్నాచ్ 141 కిలోలు, క్లీన్ అండ్ జర్క్ 168 కిలోలు.. మొత్తం 309 బరువెత్తి బంగారు పతకం సాధించాడు. అజయ్‌కు ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నాయకులు మొయిద అక్కోజీ అభినందనలు తెలియజేశారు.

అగ్నివీర్ - వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి- విజయనగరం కోట

అగ్నిపథ్ స్కీం ద్వారా అగ్నివీర్-వాయు సేనలో ఉద్యోగాలకు ఆన్ లైన్ ద్వారా అభ్యర్థుల నుంచి దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సెట్విజ్ సిఇఒ బి.రామ్ గోపాల్ తెలిపారు. ఇంటర్మీడియట్ / డిప్లమా పూర్తి చేసుకున్న అవివాహిత పురుష , మహిళా అభ్యర్థుల నుండి ఆన్ లైన్ దరఖాస్తుల స్వీకరణ ఈ నెల 27 నుంచి ఆగస్టు 17 వరకు https://agnipath-vayu.cdac.in వెబ్ సైట్‌లో స్వీకరించనున్నట్లు తెలిపారు. విద్యార్హత సైన్స్ విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ ఎంపిసి 50శాతం ఉత్తీర్ణత (లేదా) మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, కంప్యూటర్ సైన్స్, ఇన్స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్పెసిలిజషన్ తో 3 సంవత్సరాల డిప్లమా కోర్స్‌లో 50శాతంతో ఉత్తీర్ణత (లేదా) రెండేళ్ల ఒకేషనల్ కోర్సులో ఉత్తీర్ణతతో పూర్తిచేసి ఉండాలని తెలిపారు. సైన్స్ కాకుండా ఇతర విభాగాల ఉద్యోగాలకు ఇంటర్మీడియట్ పాస్ అయి ఉండాలని, అభ్యర్థులు 27.06.2003 నుండి 27.12.2006 మధ్య జన్మించి ఉండాలి. శారీరక దారుఢ్యం : 152.5 సెంటి మీటర్లు పురుషులకు, 152 సెంటి మీటర్లు మహిళలకు ఎత్తు కలిగిఉండాలని తెలిపారు. అభ్యర్థులకు అక్టోబర్ 13న ఆన్‌లైన్‌లో రాత పరీక్ష ఉంటుందని, ఆ తరువాత ఫిజికల్ ఫిట్నెస్ పరీక్ష ఉంటుందని తెఇపారు. ఎంపికైన వారికి 4ఏళ్ల షార్ట్ టర్మ్ సర్వీస్ అగ్నివీర్-వాయు సేనలో సర్వీస్ లోకి తీసుకుంటారని తెలిపారు.



మూతపడిన ఇంపెక్స్ పరిశ్రమ

ఉపాధిపై వేటు

అసలే పారిశ్రామికంగా అత్యంత వెనుకబడిన జిల్లా. ఆపై గత ప్రభుత్వ విధానాల వల్ల జిల్లాలో కొకొల్లాలుగావున్న జ్యూట్ పరిశ్రమలు మూతపడ్డాయి. అప్పట్లో సుమారు 16వేల కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయాయి. తాజాగా వైసిపి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు భారీగా పెంచడంతో ఫెర్రో ఎల్లాయిూస్ పరిశ్రమలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. నేడో రేపో మూసివేయాల్సిన పరిస్థితి ఏర్పడిందంటూ వివిధ పరిశ్రమల యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఇదే జరిగితే ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 20 వేల కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడనుంది.

- ప్రభుత్వ నిర్వాకంతో మూసివేత దిశగా ఫెర్రో పరిశ్రమలు
- భరోసా ఇవ్వని సర్కారు
- 20 వేల కుటుంబాల జీవనం ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 40 ఫెర్రో పరిశ్రమలు ఉన్నాయి. అందులో అత్యధికంగా 17 పరిశ్రమలు విజయనగరం జిల్లాలోనే ఉన్నాయి. ఇందులోనూ బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లో బెర్రి పరిశ్రమలో తొమ్మిది, హీరో ఫెర్రో పరిశ్రమలో రెండు, ఇంపెక్స్ పరిశ్రమలో రెండేసి ఫర్నేసులు ఇలా తొమ్మిది వరకు ఉన్నాయి. స్థానికంగా ఖనిజాలు అందుబాటులో ఉండడంతో ఇందుకు కారణం. మిగిలిన 20 పరిశ్రమలు శ్రీకాకుళం, విశాఖ తదితర జిల్లాల్లో ఉన్నాయి. వీటి మనుగడ సాగాలంటే మాంగనీస్ ఖనిజంతోపాటు విద్యుత్ ఛార్జీల రాయితీ అత్యంత కీలకంగా ఉంటుంది. వైసిపి అధికారంలోకి రాకముందు యూనిట్ విద్యుత్తు రూ.4.95కు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో 5 పైసలు వసూలు చేసే వారు. అప్పట్లో ఫెర్రో పరిశ్రమలకు యూనిట్ రూ.5కే ఇచ్చేవారు. ఛార్జీలు భారంగా మారడంతో విద్యుత్ రాయితీల కోసం యాజమాన్యాలు చాలా ఏళ్లగా ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తునే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ రాయితీలు ఇవ్వాల్సిన ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు మరింతంగా పెంచింది. పరిశ్రమలకు ప్రస్తుతం సరఫరా చేస్తున్న ధరపై అదనంగా యూనిట్‌కి రూ.2.50 చొప్పున పెంచారని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. ఈనేపథ్యంలో టన్ను ఉత్పత్తిపై అదనంగా రూ.10వేల వరకు భారం పడుతుందని చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే బొబ్బిలిలో ఉన్న సిరి ఫెర్రో, యోన, ఇంపెక్స్, గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో పరిశ్రమలు మూతపడ్డాయి. మిగిలిన యాజమాన్యాలు కూడా అత్యంత క్లిష్టమైన పరిస్థితుల నడుమ నడుపుతున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే ఎన్నాల్లో నడపలేమని చెబుతున్నాయి. ఈనేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫెర్రో పరిశ్రమలను మూసివేసేందుకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల అసోసియేషన్ ఇటీవల తీర్మానించింది. ఈ మేరకు కార్మిక శాఖ అధికారులకు నోటీసులు కూడా అందించినట్లు సమాచారం.



సమావేశంలో మాట్లాడుతున్న జెసి మయూర్ అశోక్

21 నుంచి ఇంటింటి సర్వే


కచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించాలి : జెసి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 21 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. నెల రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం అనంతరం అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలని కోరారు. ఎస్.కోట, ఎల్.కోట బూత్ స్థాయి అధికారులకు ఇంటింటి సర్వేపై శృంగవరపుకోటలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెసి మాట్లాడుతూ ఓటర్ల జాబితాల్లో ఎక్కడా తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఫొటోల డూప్లికేషన్ లాంటి పొరపాట్లను గుర్తించి సరిచేయాలన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి కచ్చితమైన వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఒక కుటుంబం ఓట్లు ఒకే పోలింగ్ స్టేషన్లో ఉండేలా చూడాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలని, ముఖ్యంగా యువ ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జెసి సూచించారు. కార్యక్రమంలో ఎస్.కోట ఇఆర్ఒ సుదర్శనదొర, తహశీల్దార్లు డి.శ్రీనివాసరావు, ఆదిబాబు, ఎంపిడిఒ శేషుబాబు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలపై 18న ధర్నా

విజయనగరం టౌన్ : ఆశా వర్కర్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సుధారాణి తెలిపారు. ఈమేరకు డిఎంహెచ్ఒ ఎస్.భాస్కరరావుకు శుక్రవారం ధర్నా నోటీసును అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు పని భారాన్ని తగ్గించాలని, సంబంధం లేని పనులు చేయించరాదని, ఆన్‌లైన్ లేదా రికార్డులు ఒక పని ఒక్కసారి మాత్రమే చేసేలా చూడాలని,అధికారుల బెదిరింపులు, వేధింపులు ఆపాలని,నాణ్యమైన సెల్ ఫోన్స్, 4 జి సిమ్స్ ఇచ్చి, శిక్షణ ఇవ్వాలని,ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్స్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేయన్నుట్లు తెలిపారు. ఆశా వర్కర్లు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మహాలక్ష్మి, పద్మ, గౌస్య పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి బిఎన్ దివాన్

నెలాఖరికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి బిఎన్ దివాన్

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెలాఖరులోగా ఇచ్చిన లక్ష్యాల మేరకు ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని గృహ నిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి బిఎన్ దివాన్ ఆదేశించారు. శుక్రవారం గుంకలాం, కొండకరకాం లేఅవుట్లను పరిశీలించారు. నిర్మాణాలను తనిఖీ చేశారు. గృహనిర్మాణ శాఖాధికారులతో సమీక్షించారు. నిర్మాణంలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 77,021 ఇళ్లు మంజూరు కాగా తొలిదశ కింద 36,233 ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. వీటిలో ఇప్పటివరకు 32,883 ఇళ్లు పూర్తి అయ్యాయని, మిగిలినవాటిని ఈ నెలాఖరుకు పూర్తి చేయాలని ఆదేశించారు. రెండో దశ కింద చేపట్టనున్న సుమారు 30వేల ఇళ్లను డిసెంబరు నెలాఖరునాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఇచ్చిన లక్ష్యాలను నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని సిబ్బందిని కోరారు. పర్యటనలో హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసుల పరిష్కారంలో చొరవ చూపాలి

విజిలెన్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల పరిష్కారంలో అధికారులు, పోలీసులు ప్రత్యేక చొరవ చూపాలని, బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. విద్య, వైద్య ఇతర మౌలిక వసతుల కల్పనలో వారికి పూర్తి స్థాయి సహకారం అందించాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా దళితుల పట్ల వివక్ష చూపరాదని హెచ్చరించారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగిన జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్‌తో పాటు ఎస్‌పి ఎం.దీపిక, జెసి మయూర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో భాగంగా సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు రత్నం అజెండా అంశాలను వెల్లడించారు. గత సమావేశంలో వచ్చిన అంశాలు తీసుకున్న చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా సభ్యులు పలు ప్రశ్నలు లేవనెత్తారు. దళితుల కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలని, ముఖ్యంగా శ్మశాన వాటికలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కొన్ని ప్రయివేటు పాఠశాలల్లో విద్యాహక్కు చట్టం సరిగ్గా అమలు కావటం లేదని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా... పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. రాజాం, రేగిడి మండలాల పరిధిలో శ్మశాన వాటికల ఏర్పాటుకు అనుకూలమైన స్థల పరిశీలన చేసి కేటాయించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాజాం పట్టణ పరిధిలో ఎస్‌సి సామాజిక భవన నిర్మాణానికి స్థలం కావాలని సభ్యులు కోరగా పరిశీలన చేసి అనువైన స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అట్రాసిటీ కేసుల విచారణలో భాగంగా వస్తున్న సాక్షులకు టిఎ, డిఎల నిబంధనల ప్రకారం సకాలంలో చెల్లించాలని అధికారులకు సూచించారు. బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ కోసం సభ్యులు విజ్ఞప్తి చేయగా వివిధ విభాగాల్లో ఖాళీల వివరాలను సేకరించి నివేదిక అందజేయాలని సాంఘిక సంక్షేమ శాఖ డిడిని కలెక్టర్ ఆదేశించారు. పట్టణంలో గుడి, బడికి సమీపంలో ఉండే మద్యం దుకాణాల విషయంలో నిబంధనలు పాటించి తగిన చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డిఆర్ఒ ఎం. గణపతిరావు, సాంఘిక సంక్షేమ శాఖ డిడి రత్నం, ఆర్డీవో ఎం. సూర్యకళ, కమిటీ సభ్యులు భానుమూర్తి, సిహెచ్. శ్రీను, ఆర్. జయరావు, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు, డిఎస్‌పిలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

ఎస్‌టిలకు కేటాయించిన నిధులను ఖర్చు చేయాలి

జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలు రాజ్యాంగ నిష్పత్తి ప్రకారం షెడ్యూల్డు తెగల వారికి కేటాయించిన నిధులను వారికోసం పూర్తిస్థాయిలో ఖర్చుచేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. ఎస్‌టి సబ్ ప్లాన్ అమలుపై కలెక్టర్ శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యంగా ఇళ్ల నిర్మాణం చేపట్టే గిరిజనులకు ఇళ్లనిర్మాణం పూర్తిచేసేలా అవసరమైన సహకారాన్ని గృహ నిర్మాణ సంస్థ అందించాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఔట్ సోర్సింగ్ నియామకాలు చేపట్టినపుడు రోస్టర్ విధానంలో ఎస్.టి.లకు దక్కాల్సిన పోస్టులను వారితోనే భర్తీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని ఎస్.టి. కుటుంబాల్లోని పిల్లలందరూ శతశాతం బడిలో చేరేవిధంగా చర్యలు చేపట్టాలని డిఇఒ ఆదేశించారు.

సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జిల్లా రెవిన్యూ అధికారి ఎం.గణపతిరావు, గిరిజన సంక్షేమ అధికారి చంద్రశేఖర్ రావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

డిఎంహెచ్ఒ భాస్కరరావు

ప్రజాశక్తి-విజయనగరం

లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్ల పై చర్యలు తీసుకుంటామని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు హెచ్చరించారు. శుక్రవారం గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ ప్రక్రియ చట్టం 1994 అమలుపై నియమించిన జిల్లా స్థాయిస సలహా కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గర్భస్థ పిండ పరిస్థితి, వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారులు స్కానింగ్ సెంటర్ లను విధిగా పర్యవేక్షించాలని సూచించారు.రిజిస్ట్రేషన్ కోసం ఎఆర్‌టి నేషనల్ పోర్టల్ లో దరఖాస్తు చేసుకోవాలని, ఎఆర్‌టి క్లినిక్ లెవెల్-1 కు రూ.50వేలు, లెవెల్-2 క్లినిక్ కు రూ.2లక్షలు, ఎఆర్‌టి బ్యాంకు రూ.50వేలు, సరోగసి క్లినిక్ రూ.2లక్షలు చొప్పున డిస్ట్రిక్ట్ అప్రోప్రియేట్ ఆథారిటీ పేరున జాతీయ బ్యాంకులలో డిడి తీయాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీకా నియంత్రణ అధికారి అచ్చుత కుమారి, ఉప జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవి కుమార్ పాల్గొన్నారు.



నర్సింగరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపి విజయసాయిరెడ్డి

జెడ్‌పి చైర్మన్‌కు విజయసాయిరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పితృ వియోగం చెందిన జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, కురుపాం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి, జిల్లా ఎస్‌పి ఎం.దీపిక శ్రీకాకుళం ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతి, ఇ- ప్రగతి చైర్మన్,రాష్ట్ర జిసిఎస్ ఇంఛార్జి హర్షవర్ధన్ రెడ్డి, శుక్రవారం పరామర్శించారు. చిన్నశ్రీను నివాసానికి చేరుకని ఆయన తండ్రి నర్సింగరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్న శ్రీను కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

1.05 కోట్లతో అభివృద్ధి పనులు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో వివిధ ప్రాంతాలలో కోటి ఐదు లక్షల రూపాయలతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శుక్రవారం శంకుస్థాపన చేశారు. జొన్న గుడ్డిలో కళ్యాణ మండపం నిర్మాణానికి, రింగ్ రోడ్ లో కాలువ నిర్మాణానికి, రాజీవ్ నగర్ కాలనీలోనూ, రైతు బజార్ సమీపంలోను పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకుస్థాపన మాస మహోత్సవాల్లో భాగంగా నెల రోజులపాటు ప్రతిరోజూ ఏదో ఒక ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేస్తున్నామన్నారు. మొత్తం 116 పనులకు శంకుస్థాపనలు చేస్తున్నామని, వెంటనే పనులు ప్రారంభించి పూర్తయ్యే విధంగా ప్రత్యేక దృష్టి సారించామన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, స్థానిక కార్పొరేటర్లు దుప్పాడ సునీత, జాకీర్ హుస్సేన్, నాయిని పద్మ, వైసిపి నాయకులు ఎవర్ణ కుమారస్వామి, నాయన మహేష్ పాల్గొన్నారు.

48వ డివిజన్ లో గడప గడపకూ

నగరంలోని 48వ డివిజన్ గాజులరేగ, శాలి వీధిలో జరిగిన గడపగడపకు కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందిస్తున్న పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల వివరాలతో కూడిన బుక్లెట్లను అందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు మధు, కార్పొరేటర్ నడిపిల్లి ఆదినారాయణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

61వ సచివాలయం ప్రారంభం

నగరపాలక సంస్థ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన 61వ నెంబర్ సచివాలయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శుక్రవారం ప్రారంభించారు. సచివాలయానికి అవసరమైన సదుపాయాలు అడిగి తెలుసుకున్నారు.సచివాలయాన్ని ప్రారంభించిన అనంతరం కార్యదర్శులతో కొద్దిసేపు మాట్లాడారు. సచివాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ శ్రీ రాములు నాయుడు మాట్లాడుతూ నగర పరిధిలో 476 కుటుంబాలకు సంబంధించి 61వ సచివాలయం అవసరం ఉండగా విషయాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి దృష్టికి తీసుకువెళ్లి ఏర్పాటు చేశామని తెలిపారు. మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయ యాదవ్, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్, వైసిపి నగర అధ్యక్షులు ఆశపు వేణు పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

కల్వర్టు ప్రారంభం

నగరంలోని పిడబ్ల్యూడి మార్కెట్ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కల్వర్టును డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ప్రారంభించారు. రూ.35 లక్షల రూపాయలతో నిర్మించిన కల్వర్టు ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా నిలవనుందని అన్నారు.

16న గ్రంథాలయ మహాసభ


ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పిల్లల్లో పఠనాసక్తిని పెంచేందుకు మరోసారి గ్రంథాల యోద్యమాన్ని చేపట్టాల్సిన అవసరం ఏర్పడిందని గ్రంథాలయ ఉద్యమ కార్యకర్త నారాయణ వేణు అన్నారు. ఆధునిక టెక్నాలిజీ అందుబాటు లోకి వచ్చిన తరువాత పిల్లల్లో పుస్తక పఠనం తగ్గిపోతోందని అన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి గ్రంథాలయోద్య మాన్ని చేపట్టేందుకు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న మేధావులు సిద్ధమవుతున్నారని అన్నారు. భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకునేందుకు విజయవాడలో ఈనెల 16న గ్రంథాలయ మహాసభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురజాడ స్వగహంలో జరిగిన మీడియా సమావేశంలో మహాసభ గోడపత్రికను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత స్థాయిలో పిల్లలను పుస్తకాలను అధ్యయనం చేసేటట్లు కొంతమంది పనిచేస్తున్నారన్నారు. అందులో ఈ జిల్లాలోనే ఉపాధ్యాయుడు జి.ఎస్. చలం, చీపురుపల్లికి చెందిన రెడ్డి రమణ ఉన్నారన్నారు. ఇటువంటి వ్యక్తులే కాకుండా మరికొంతమంది సామాజిక కార్యకర్తలు తమకి తోచిన విధంగా పిల్లల్లో చదువు పట్ల ప్రేరణ కలిగిస్తున్నారన్నారు. అటువంటి వారందరినీ కలుపుకుంటూ ఓ సామాజిక ఉద్యమంగా ఈ గ్రంథాలయోధ్యమాన్ని చేపట్టాలని భావిస్తున్నట్లు తెలిపారు. గ్రంథాలయ పరిరక్షణ కమిటీ నాయకులు ఎస్.ఎస్.ఎస్.ఎస్.వి.ఆర్.ఎం. రాజు మాట్లాడుతూ పిల్లల్లో సాహిత్యాన్ని చదవడం పట్ల ఆసక్తిని పెంచాల్సిన అవసరం ప్రస్తుత దశలో ఎంతైనా ఉందన్నారు. ఆ దిశగా సమిష్టిగా అందరూ ఈ ఉద్యమంలో భాగస్వామ్యం కావాలన్నారు. కార్యక్రమంలో రచయత జిఎస్ చలం, సామాజిక కార్యకర్త, రవూఫ్, దయానిధి, జగన్నాథ స్వామి, పాత్రికేయుడు వి.ఎం.కె. లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రచయితలు, గ్రంథాలయ సంస్థ సభ్యులు

రాజారావు సేవలు ఎనలేనివి



రాజారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

ప్రజాశక్తి-విశాఖపట్నం

పబ్లిక్‌హెల్త్ ఎస్ఇ కీర్తిశేషులు కోరాబు రాజారావు విధి నిర్వహణలో అందించిన సేవలు ఎనలేనివని పలువురు కొనియాడారు. ప్రజారోగ్య సాంకేతిక శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరింగ్ విధులు నిర్వహించిన రాజారావు గతనెల 30న అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో పబ్లిక్‌హెల్త్ విశాఖ సూపరింటిండెంట్ ఇంజినీర్ (ఎఫ్ఎసి) గణపతి రావు అధ్యక్షతన శుక్రవారం విశాఖలో సంస్మరణ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన టిడ్కో చైర్మన్ జమ్మా న ప్రసన్నకుమార్, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్, వివిధ పురపాలక సంఘాల ఇంజినీరింగ్ అధికారులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాజారావు ఉమ్మడి విశాఖ జిల్లా చింతపల్లి మండలం అంతర్ల గిరిజన గ్రామంలో జన్మించి ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి చదువుకొని అసిస్టెంట్ ఇంజినీర్ గా పురపాలక సంఘంలో చేరి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని తెలిపారు. ఉద్యోగోన్నతులు పొందిన ఉన్నతమైన స్థానానికి చేరకున్నారని, విధులు నిర్వహణలో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. విధులు సక్రమంగా నిర్వహించడం వల్ల అనేకమంది ఐఎఎస్ అధికారుల మన్ననలు పొందారని అన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాల ఇఇలు, డిఇలు, సిబ్బంది పాల్గొన్నారు.

'సీతం'లో ఉపాధ్యాయులకు శిక్షణ

పరిశీలించిన డిఇఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సీతం ఇంజినీరింగ్ కళాశాల లో 1600 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు డిజిటల్ బోధనా పద్ధతుల్లో శిక్షణ పొందుతున్నారు.ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ కొత్త బోధనా పద్ధతులను అవలంబించడంపై శిక్షణ ఇస్తున్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఎనేబుల్డ్ టీచింగ్ అండ్ లెర్నింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం కింద, ఉపాధ్యాయులు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ మద్దతుతో కొత్త బోధనా పద్ధతులను అవలంబించాల్సిఉంది. వీటిని దశలవారీగా అన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిఇఒ లింగేశ్వరరెడ్డి ఈ శిక్షణను పర్యవేక్షిస్తున్నారు. జులై 16 వరకు సీతం కళాశాల లో జరిగే శిక్షణకు ఉపాధ్యాయులంతా హాజరుకావాలని డిఇఒ కోరారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులకు సాంకేతికతను బోధించడానికి సీతంలోని ఉత్తమ అధ్యాపకులు తమ సహాయ సహకారాలను అందిస్తున్నారని అన్నారు.

మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-గజపతినగరం

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాకు ముఖ్యఅతిథిగాపార్లమెంట్ సభ్యులు బెల్లాన.చంద్రశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 కంపెనీల సౌజన్యంతో ఈ జాబ్‌మేళా నిర్వహిస్తున్నారని అన్నారు. జాబ్ మేళాకు 980 మంది హాజరు కాగా 367 మంది ఎంపికైనట్లు తెలిపారు. నిరుద్యోగుల పక్షాన ప్రభుత్వం ఎప్పుడూ ఉంటుందని, ఇటువంటి జాబ్ మేళాను యువత ఎప్పటికప్పుడు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు, మండల సురేష్, బూడి వెంకటరావు, కె.ఆదినారాయణ పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న జెసిబి

ప్రజాశక్తి కథనానికి స్పందన

ఆక్రమణలపై కొరడా

బొబ్బిలి : పట్టణంలోని ఐటిఐ కాలనీ వద్ద ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. 'పాకలు వేసి పాగా వేస్తున్నారు' కథనం ప్రజాశక్తిలో గురువారం ప్రచురితం కావడంతో రెవెన్యూ అధికారులు స్పందించి పాకలను జెసిబితో తొలగించారు. ఐటిఐ కాలనీ, జగనన్న కాలనీకి అనుసరించి ఉన్న ప్రభుత్వ స్థలంలో పాకలు వేసి స్థలాలను ఆక్రమించేస్తున్నారు. సొంతిల్లు ఉన్నప్పటికీ పశువులకు పాకలు వేస్తున్నామని చెప్పి ఆక్రమిస్తున్నారు. ప్రజాశక్తిలో కథనం రావడంతో ఆక్రమణలను తొలగించాలని తహశీల్దార్ డోల రాజేశ్వరరావు ఆదేశించారు. దీంతో ఆర్ఐ కళ్యాణ్ చక్రవర్తి, సచివాలయ సిబ్బంది పాకలను తొలగించారు.

సేవలతోనే గుర్తింపు

వంగర : వృత్తిలో నిజాయతీతో సేవలందిస్తే అరుదైన గుర్తింపు లభిస్తుందని రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, ఎస్ఐ ఆర్.జనార్ధనరావు అన్నారు. వాలంటీర్ రిటైర్మెంట్ (విఆర్ఎస్) పొందిన హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటరమణ, వంగర పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన బి.విజయకుమార్, బి.గౌరీ. డి.హరిబాబు, జి.వెంకటరమణను శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌సిలు నాయుడు, రాములు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

బొబ్బిలి : పట్టణంలోని టిఆర్ కాలనీలో కౌన్సిలర్ వి.వనజకుమారి, వైసిపి నాయకులు వి.మనోజ్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ ప్రారంభించారు.

ఉపాధ్యాయులకు ఘన వీడ్కోలు

గరివిడి : తాటిగూడ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇతర పాఠశాలలకు బదిలీ అయిన ప్రధానోపాధ్యాయులు పి.రామారావు, ఉపాధ్యాయులు బి.పావని, కె.సువర్ణమంజులను హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది ఘనంగా సత్కరించి, వీడ్కోలు పలికారు. పాఠశాలలో వారందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.మధుసూదన్, ఎ.సత్యశ్రీనివాసు, ఎల్.వి.జగన్నాథరావు, ఎ.ధనుంజయ, గోపీనాథ్, శ్రీకాంత్, జ్యోతిశ్రీ, శ్రీలత పాల్గొన్నారు.

'మహిళా శక్తి'కి తరలిన తెలుగు మహిళలు

వేపాడ : మంగళగిరిలో శుక్రవారం టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యాన నిర్వహించిన మహిళా శక్తి కార్యక్రమానికి మండలానికి చెందిన తెలుగు మహిళలు హాజరయ్యారు. తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మడి భారతి, ఎంపిటిసి గొంప తులసి, పలువురు నాయకులు హాజరయ్యారు. మహిళా శక్తి కార్యక్రమాన్ని గ్రామాల్లో ఏవిధంగా అమలు చేయాలో చంద్రబాబునాయుడు దిశానిర్దేశం చేశారు.



కార్యక్రమానికి హాజరైన తెలుగు మహిళలు

బాధితులకు ఆర్థిక సాయం

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామానికి చెందిన వికలాంగురాలు ఆడారి ధనలక్ష్మి సోంపురం జంక్షన్‌లో పండ్ల వ్యాపారం చేసుకుని జీవనం సాగించేది. బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోవడంతో ఆమె కాలు విరిగిపోయింది. దీంతో జంక్షన్‌లోని వ్యాపారులంతా రూ.25 వేలు సమకూర్చుకుని ఆమెకు అందజేశారు.

నేడు టిడిపి పాదయాత్ర

బొబ్బిలి : పూల్ బాగ్ రహదారి బాగు చేయాలని కోరుతూ పట్టణంలోని దాడితల్లి ఆలయం నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు శనివారం పాదయాత్ర నిర్వహించనున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్ ఒక ప్రకటనలో తెలిపారు. పాదయాత్రలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన పాల్గొంటారని, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఉచిత మెగా వైద్య శిబిరం

బొబ్బిలి : అభ్యుదయ పాఠశాల ఆవరణలో ఆదివారం అభ్యుదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ చింతా శారద తెలిపారు. నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శిబిరంలో మెదడు, ఎముకల నొప్పులు, కిడ్నీ, యూరిన్, చెవి, ముక్కు, గొంతు, కంటి, స్త్రీలకు సంబంధించిన, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. అవసరమైన రోగులకు శస్త్ర చికిత్స చేస్తారని చెప్పారు.

16న ఆనందోబ్రహ్మ

బొబ్బిలి : యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో ఆనందోబ్రహ్మ కార్యక్రమాన్ని ఈ నెల 16న స్థానిక కళాభారతిలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు ఎం.విజయ మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి పి.నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరాణిక, చారిత్రక, సాంఘిక, జానపద కళలను ప్రతిబింబించే ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-బొబ్బిలి

రైలు ఢీకొని పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన పి.ప్రసాద్ మృతి చెందాడు. రైల్వే ఫ్లైఓవర్ వద్ద ప్రసాద్ రైలు పట్టాలు దాటుతుండగా విజయనగరం నుంచి బొబ్బిలి వైపు వస్తున్న గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన ప్రసాద్‌ను అదే రైలులో బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు తీసుకెళ్లి అక్కడ నుంచి 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ప్రసాద్ మరణించినట్లు కుటుంబ సభ్యులు చెప్పారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

13 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-వంగర

మండలంలోని శివ్వాం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కొక్కిరిగెడ్డ రామును అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆర్.జనార్ధనరావు తెలిపారు. ఆయన వద్ద 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. జనార్ధనరావును అరెస్టు చేసి పాలకొండ జ్యుడీషియల్ కస్టడీకి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

20 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-బాడంగి

మండలంలోని డొంకినవలస రైల్వే కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 20 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎఎస్ఒ అశోక్ తెలిపారు. వాహనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో సిఎస్ డిటి స్వర్ణలత, రెడ్డి సాయి కృష్ణ, రవిశంకర్ పాల్గొన్నారు.



అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

జగనన్న సురక్షతో విస్తృత సేవలు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

జగనన్న సురక్ష ద్వారా విస్తృతంగా సేవలు అందుతున్నట్లు ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం మొయిద విజయరాం పురంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యులు అంబళ్ల శ్రీరాములునాయుడు, డిసిసిబి వైస్ చైర్మన్ చనుమల్ల వెంకటరమణ, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, ఎంపిటిసి పి.సంతోష్‌బాబు, సర్పంచ్ అట్టాడ కృష్ణ, నాయకులు లెంక గోవిందరావు, అట్టాడ కనకారావు, ఎంపిడిఒ జి.గిరిబాల, డిటి డి.శైలజ పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని ఎన్‌కెఆర్ పురం, బల్లంకి గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాలకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జగనన్న సురక్ష ద్వారా సంక్షేమ పథకాలు పొందేలా అర్హులైన వారందరినీ గుర్తించి, ధ్రువపత్రాలు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, ఎంపిపి డి.సత్యవంతుడు, జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, సర్పంచులు గొటివాడ దేవి, బి.రాము నాయుడు, తహశీల్దార్ ప్రసన్న కుమార్, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు పాల్గొన్నారు.

జామి : జగనన్న సురక్ష కార్యక్రమంలో దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఆర్.బి పురం రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టినప్పటి నుంచి పాలనలో సమూల మార్పులు చేసినట్లు తెలిపారు. సామాన్యుడికి సైతం అందుబాటులో ఉండేలా, సమస్య పరిష్కారం అయ్యేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారని చెప్పారు. అనంతరం జట్టేటివలస సచివాలయంలో సురక్ష కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ రఘురాజు హాజరై, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, వైసిపి మండల అధ్యక్షులు గొర్లె రవి కుమార్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సత్యారావు, జెసిఎస్ మండల ఇన్‌ఛార్జి శిరెడ్డి చంద్రునాయుడు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, తహశీల్దార్ హేమంత్ కుమార్, సర్పంచులు వర్రి కృష్ణ, పిల్లా భవాని, ఎంపిటిసి ముగడ నాగమణి, కనకరాజు, దువ్వు అప్పలరాము పాల్గొన్నారు.





వేపాడ.. మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు; బొబ్బిలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి : అవినీతి రహిత పాలనకు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. మల్లమ్మపేటలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో అవినీతి రహిత పాలన అందిస్తున్నామని చెప్పారు. టిడిపి హయాంలో డబ్బులిస్తేనే సంక్షేమ పథకాలు అందేవని చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి పట్టణ అధ్యక్షులు ఇంటి గోపాలరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అల్లుపేటలో దారుణం

- బాలుడిని హత్య చేసిన తల్లి
- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ప్రజాశక్తి-డెంకాడ

విశాఖ జిల్లా భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ అల్లుపేటలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. బాలుడిని తల్లి హత్య చేసింది. బుధవారం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ సంఘటన డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బాలుడి తల్లిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం...

భీమిలి మండలం దాకమర్రి పంచాయతీ పరిధిలోని అల్లుపేటకు చెందిన బట్ట కొండమ్మ, బంగారయ్యకు ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి గణేష్(5), దినేష్ (3) కుమారులు ఉన్నారు. కొండమ్మకు 15 ఏళ్ల వయసులోనే వివాహమైంది. భార్యాభర్తలు నిత్యం గొడవలు పడుతుండేవారు. ఈ నేపథ్యంలో పిల్లలతో కలిసి అదే గ్రామంలోని పుట్టింటికి కొండమ్మ వెళ్లిపోయింది. వారం కిందట గ్రామపెద్దలు ఇద్దరికి సర్దిచెప్పినా ప్రయోజనం లేకపోయింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు పిల్లలను పుట్టింటి నుంచి తీసుకుని బయటకు ఆమె వెళ్లిపోయింది. తెల్లవారినా ఇంటికి రాకపోవడంతో కంగారుపడిన కుటుంబ సభ్యులు పరిసరాల్లో గాలించారు. గ్రామంలో టీ దుకాణం సమీపంలో గురువారం ఉదయం కొండమ్మ కనిపించింది. చిన్నకుమారుడు కనిపించక పోవడంతో ఆమెను ప్రశ్నించారు. గోతిలో పడి చనిపోయినట్లు చెప్పింది. అల్లుపేట సమీపంలో ఉన్న మండలంలోని మోదవలస రెవెన్యూ పరిధిలోని నిర్మానుష్య ప్రదేశంలో దినేష్ విగతజీవిగా పడి ఉన్నాడు. బాలుడి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లి, భర్త బంగారయ్యకు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. తమ్ముడిని అమ్మ పీక నులిపేసిందని పెద్ద కుమారుడు చెప్పాడని భీమిలి పోలీస్‌స్టేషన్‌లో బంగారయ్య ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేశారు. ఈ సంఘటనా స్థలం డెంకాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉందని గురువారం రాత్రి కేసును ఇక్కడకు బదిలీ చేశారు. దీంతో కొండమ్మను డెంకాడ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

విజయనగరం రెండో పట్టణ సిఐ లక్ష్మణరావు, ఎస్ఐ మహేష్.. ఆమెను విచారించారు. ఆమె తొలుత పొంతనలేని సమాధానాలు చెబుతూ కాలయాపన చేసింది. చివరికి గొంతునులిమి హత్య చేసినట్లు అంగీకరించింది. చిన్నకుమారుడు దినేష్ తండ్రికి దగ్గరగా, ఆప్యాయతగా ఉండటంతో ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసులు తెలిపారు. బాలుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు.



ఎమ్‌పి చంద్రశేఖర్ కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

వంతెనలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-గజపతినగరం

రైల్వేగేట్ల వద్ద వంతెనలు నిర్మించాలని ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌కు సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు జి.శ్రీనివాస్ వినతిపత్రం అందించారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన జాబ్‌మేళాకు హాజరైన ఎమ్‌పిని కలిసి వినతి అందించారు. గజపతినగరం మండలంలో పురిటిపెంట రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణ ప్రతిపాదనలో చలనం లేదన్నారు. దత్తిరాజేరు మండలం మానాపురం రైల్వే గేటు వద్ద వంతెన నిర్మాణం మధ్యలో నిలిచిపోయిందని తెలిపారు. దీనివల్ల ఈ మార్గాల గుండా ప్రయాణించే విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలతోపాటు అత్యవసర సమయాల్లో క్షతగాత్రులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఒక్కోసారి ప్రాణాపాయ పరిస్థితి కూడా ఎదురవుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. వెంటనే స్పందించి వంతెనలు ఏర్పాటు చేయాలని కోరారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

విజయనగరం : జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్‌పి ఎం.దీపిక పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది సమస్యలను తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. హోంగార్డు గా పని చేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన ఎ.సోమయ్యకు చేయూతగా హోంగార్డులు సమకూర్చిన ఒక్క రోజు అలవెన్స్ రూ.3,80,080 చెక్‌ను ఎస్‌పి అందజేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్‌పి ఎల్.శేషాద్రి, ఆఫీసు పర్యవేక్షకులు ప్రభాకరరావు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస ప్రాంతానికి చెందిన తీగల సన్యాసిరావు (85) శుక్రవారం మరణించారు. ఆయన మృతి చెందిన వెంటనే కుమారులు సన్యాసయ్య గుప్తా, వెంకటప్పయ్య విశాఖపట్నానికి చెందిన మోషిన్ ఐ బ్యాంకుకు నేత్రాలు దానం చేశారు. డాక్టర్ విన్నకోట రాజేష్ ఆధ్వర్యంలో నేత్రాలను సేకరించి, భద్రపరిచారు.



సన్యాసిరావు

వైసిపి నాయకుల వ్యాఖ్యలపై నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా పాలన జనసేనతోనే సాధ్యమని జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి అన్నారు. పవన్ కళ్యాణ్‌పై వైసిపి నేతలు అసభ్యకర వ్యాఖ్యలకు నిరసనగా పవన్ కళ్యాణ్ చిత్రపటాలను ఊరేగిస్తూ పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ ను రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేకపోవడంతోనే వ్యక్తిగతంగా వైసిపి నాయకులు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా పాలనలో వైసిపి పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పాల్గొన్నారు.

జనసేనలో యువకులు చేరిక

తెర్లాం, బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీకు చెందిన యువకులు జనసేనలో చేరారు. వీరికి బాబు పాలూరి కండువాలు వేసి ఆహ్వానించారు. జనసేన బలోపేతానికి యువత ఐక్యంగా పని చేయాలని కోరారు.

ఎమ్మెల్యే బడ్డుకొండపై ఫిర్యాదు

నెల్లిమర్ల : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేసినందుకు ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడుపై జనసేన పార్టీ నాయకులు లోకం మాధవి ఆధ్వర్యాన నెల్లిమర్ల పోలీసులకు ఫిర్యాదుచేశారు. కొందరు వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను వైసిపి నాయకులు వక్రీకరించి, వారిని రెచ్చగొట్టారని లోకం మాధవి తెలిపారు. ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని కోరారు.




నెల్లిమర్లలో ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు

డెంకాడ : స్థానిక పోలీస్ స్టేషన్లో వైసిపి నాయకులపై జనసేన నాయకులు తుమ్మి లక్ష్మిరాజ్, తుమ్మి అప్పలరాజు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నెల్లిమర్ల మండలం సతివాడలో జనసేనాని పవన్ కళ్యాణ్‌ను వైసిపి నాయకులు అసభ్యకరంగా మాట్లాడడమే కాకుండా చెప్పులతో కొట్టడం, దిష్టిబొమ్మ దగ్ధం చేశారని తెలిపారు. వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు కార్యక్రమంలో రమేష్, పి.సురేష్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించడమే లక్ష్యం

నూతన భవనాలను ప్రారంభించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



కొప్పరవలసలో ప్రభుత్వ భవనాల సముదాయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు

ప్రజాశక్తి-వంగర

గ్రామాల్లో ప్రజలకు సుపరిపాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. మండలంలోని మగ్గూరు, కొప్పరవలస గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయాలు, వెల్‌నెస్ సెంటర్లు, రైతు భరోసా కేంద్రాలను ఆ గ్రామాల సర్పంచులు పోలిరెడ్డి రమేష్, సాదెం లలితకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సుమారు కోటి రూపాయలతో ప్రభుత్వ నూతన భవనాలను నిర్మించి గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి యు.సురేష్‌ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, ఎంపిడిఒ వి.శ్రీనివాసరావు, డిటి బి.సుందరరావు, ఇఒపిఆర్‌డి ఎల్.త్రినాథరావు, తదితరులు పాల్గొన్నారు.

మెట్టు పొలాల్లో రాగి సాగు



గజపతినగరం.. విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రైతులు మెట్టు భూముల్లో రాగి పంట వేసుకోవాలని ఎఒ ఎం.పూర్ణిమ సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో చైర్మన్ జమ్ము అప్పలనాయుడు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పూర్ణిమ మాట్లాడుతూ రాగి పంట వల్ల రైతులకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. రాగి పంటకు ప్రభుత్వం మద్దతు ధర క్వింటాకు రూ.3860గా నిర్ణయించి నట్లు తెలిపారు. రాగి మిని కిట్లు ఉచితంగా 40ఎకరాలకు సరిపడా వచ్చాయని, అర్హులైన రైతులకు పంపిణీ చేస్తామని తెలిపారు. ఎకరాకు 2 నుంచి 2.5 కిలోల కంది విత్తనాలు పూర్తి రాయితీపై అందిస్తున్నట్లు చెప్పారు.

గజపతినగరం : గజపతినగరంలోని ఆర్‌బికెలో శుక్రవారంమండల స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని ఎఒ సిహెచ్.ధనలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎడి కె.మహారాజన్ మాట్లాడుతూ చోడి పంట ప్రయోజనాలను వివరించారు సలహా మండలి చైర్మన్ సామంతుల పైడిరాజు మాట్లాడుతూ పిఎం కిసాన్ కోసం అర్హులైన రైతులకు ఇ-కెవైసి చేయించాలని విఎఎలను ఆదేశించారు. అనంతరం చోడి, కందుల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖాధికారి వెంకటరమణ, సూపరింటెండెంట్ సుదర్శన్ పాల్గొన్నారు.

నువ్వుల పొలంలో బహుళ పంటలు

జామి : మండలంలో సిరికిపాలెం గ్రామంలో 80 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నువ్వులలో సాగుచేస్తున్న బహుళ పంటలను ఆర్‌టిఒ ప్రకాశ్, వ్యవసాయాధికారి హేమసుందర్ పరిశీలించారు. గోంగూర, తోటకూర, బెండ, చిక్కుడు, బీర, ఆనప, కొర్రలు, గంటెలు, సామలు, జొన్నలు, మొక్కజొన్న వేయడం వల్ల భూమికి కావలిసిన అన్ని పోషకాలు లభిస్తాయని వారు తెలిపారు. శిరికిపాలెం గ్రామంలో రైతులు చేపట్టిన వరి విత్తనాలు వేసుకునే ముందు బీజామృతంతో విత్తనశుద్ధిని పరిశీలించారు. దీంతో 95 శాతం మొలక శాతం వచ్చిందని రైతులు చెప్పారు. కార్యక్రమంలో ఎఒ కిరణ్ కుమార్, వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

నెల్లిమర్ల : ఒమ్మి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. ప్రకృతి వ్యవసాయ కార్యకర్త వర్రి గాయత్రి మాట్లాడుతూ విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. బీజామృతంతో వరి విత్తనాలను శుద్ధి చేయడం వల్ల తెగుళ్ల రాకుండా కాపాడుకోవచ్చన్నారు. మొలక శాతం కూడా పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐసిఆర్‌పి ఎస్.రామలక్ష్మి పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో రైతుకు మేలు

కొత్తవలస : చీడువలస గ్రామంలో సబల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయశాఖ సహకారంతో విత్తనశుద్ధిపై ఐసిఆర్‌పి ఎం.వాసు లక్ష్మి రైతులకు అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల విత్తనం ద్వారా వ్యాప్తి చెందే తెగుళ్లను వందశాతం నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ ఫీల్డ్ కోఆర్డినేటర్ బి.గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ చలుమూరు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ మేడపురెడ్డి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌డిఒ కార్యాలయం ద్ద ధర్నా చేస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు

జిఒ 22ను రద్దు చేయాలని

డిగ్రీ కళాశాలల బంద్

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రయివేట్ డిగ్రీ కళాశాలలకు నష్టం చేకూర్చే జిఒ 22ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పట్టణంలో ఉన్న డిగ్రీ కళాశాలలను బంద్ చేశారు. రాజా, గాయత్రి, శ్రీసాయి, శ్రీషిరిడిసాయి, విద్వాన్ డిగ్రీ కళాశాలలను యాజమాన్య ప్రతినిధులు మూసివేశారు. ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా యాజమాన్య ప్రతినిధులు బదరి, రెడ్డి మోహన్, టికెఎం, ఎం.అప్పలనాయుడు, బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు నష్టం చేకూర్చేలా ప్రభుత్వం ఎపి హెచ్ఇఆర్ఎంసి జిఒ 22ను తీసుకువచ్చిందన్నారు. ఆన్‌లైన్ అడ్మిషన్ విధానాన్ని తీసుకురావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిఒ 22ను రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఆఫ్‌లైన్ అడ్మిషన్లకు అనుమతులు ఇవ్వాలని కోరారు.

విద్యా ప్రమాణాల మెరుగు బాధ్యత సిఆర్‌పిలదే

ప్రజాశక్తి-రేగిడి

విద్యార్థుల విద్యాప్రమాణాలు మెరుగుకు కాంప్లెక్స్ పరిధి సిఆర్‌పిలదే బాధ్యతని డిప్యూటీ డిఇఒ బ్రహ్మాజీ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లు, ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళిక బద్ధంగా ఫేషియల్ హాజరు యాప్, మధ్యాహ్న భోజనం పథకం అమలు, సమయపాలన తప్పనిసరిగా ఉండాలన్నారు. సమావేశంలో ఎంఇఒలు ఎంవి ప్రసాదరావు, ఎరకయ్య, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, ఎపి సూర్యారావు, అప్పలనాయుడు, సిఆర్‌పి వెంకటరమణ, చందర్రావు, కృష్ణ, మోహనరావు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కొట్టాం పిహెచ్‌సి పరిధిలోని ఏడు ప్రభుత్వ వసతిగృహాల్లో శుక్రవారం దోమల మందు పిచికారీ చేసినట్లు సబ్ యూనిట్ వైద్యాధికారి బి.శ్రీనివాస్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు తెలిపారు.